నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | జూన్ 03, 2024 | www.navatelangana.com

ఊరూరా బోనాల పండుగ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం కుల సంఘాల ఆధ్వర్యంలో గ్రామదేవతలకు పూర దేవతలకు బోనాలను తీశారు. మండలంలోని బాణాపూర్ గ్రామంలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లికి, ఇతర కులాల వారు దుర్గమ్మకు, నల్ల పోచమ్మ బోనాలు తీశారు. మెంగారం, శెట్టిపల్లి సంగారెడ్డి, రాంపల్లిలో ఘనంగా బోనాలు తీశారు.


బోనాల పండుగలో పాల్గొన్న పలువురు

పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్‌కు మెమో జారీ

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్‌కు జిల్లా వైద్యాధికారి డా.తుకారం రాథోడ్ శనివారం మెమో జారీ చేశారు. గత నెల 22వ తేదీన జిల్లా వైద్యాధికారి డా.తుకారం రాథోడ్ పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సందర్భంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ విధులలో లేకుండా గైర్హాజరైనట్టు గుర్తించారు. దాంతో ఆయనకు డీఎంఅండ్‌హెచ్ఓ శనివారం మెమో జారీ చేశారు. అయితే మెమో అందిన తేదీ నుంచి (3) రోజులలోపుపైన పేర్కొన్న వివరణ కోసం మెడికల్ ఆఫీసర్ రిమార్క్‌లతో పాటు తన వివరణను సమర్పించాలని సాలూర పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్‌ని డీఎంఅండ్‌హెచ్ఓ ఆదేశించారు. లేని పక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

రాష్ట్ర అవతరణ వేడుకల్లో కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్


పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలు మరువలేనివని, వారి ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో జాతీయ పతాకావిష్కరణ గావించిన అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం సాగిన మహెూద్యమంలో పాలుపంచుకున్న వారందరికీ అభినందనలు తెలుపుతూ, ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరిస్తూ నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 వసంతాలు పూర్తి చేసుకొని 11వ వసంతంలోకి అడుగిడుతూ ఉత్సాహ పూరిత వాతావరణంలో వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారి ఆశయాలు, ఆకాంక్షల మేరకు రాష్ట్రాన్ని, జిల్లాను అభివృద్ధి పథంలో పయనించుటలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించుటలో, అధిక సంఖ్యలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకొనుటలో జిల్లా యంత్రాంగానికి సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని స్థాయిల ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. క్యాంపు కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సింధు శర్మ, ట్రైనీ ఎఎస్పీ కాజల్ సింగ్, అదనపు కలెక్టర్లు చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, వైస్ చైర్ పర్సన్ వనిత, జెడ్పి వైస్‌చైర్మన్ ప్రేమ్ కుమార్, జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


అమరవీరుల స్థూపం వద్ద పూలమాల వేస్తున్న ఎస్పీ


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

తెలంగాణ ఉద్యమంతో జిల్లాకు విడదీయరాని బంధం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్


అమరవీరుల స్థూపం వద్ద పూలమాల వేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


జెండావందనం చేస్తున్న కలెక్టర్, సీపీ, ఎమ్మెల్యే, అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ ఉద్యమంతో జిల్లాకు విడదీయరాని అనుబంధం ఉందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా వివరించారు. 'అమరవీరుల త్యాగాల పునాదులపై, పోరాడి సాధించుకున్న తెలంగాణ నేడు అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల స్ఫూర్తితో తెలంగాణ ప్రగతిలో అన్ని వర్గాల ప్రజలు మమేకం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అమరుల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకెళ్లడం మనందరి కర్తవ్యం. తదనుగుణంగానే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, సంక్షేమం, విద్యా, వైద్యం, వ్యవసాయం సహా అన్ని రంగాలలో నిజామాబాద్ జిల్లా అభివృద్ధి పథంలో దూసుకువెళ్తోంది. ఇదే స్ఫూర్తితో జిల్లాను మరింతగా ప్రగతి బాటలో పయనింపజేసేందుకు కంకణబద్ధులై ఉన్నాం. జిల్లాలోని అన్ని సామాజిక వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతి, మంచి భోజనం అందించాలని, భావి తరాలు ఆరోగ్యంగా ఉన్నతంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసింది. ఈ కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలో 793 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల పనులు కొనసాగుతున్నాయి. పాఠశాలల ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నాం. బడిబాట కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థుల నమోదు శాతం పెంచేలా కృషి చేస్తున్నాం. మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో పిల్లల యూనిఫామ్‌లను కుట్టి ఇచ్చే పనులను ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించింది. తద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక చేయూతను అందించాలన్నది ప్రభుత్వ సంకల్పం. ఇటీవల జరిగిన 2024 పార్లమెంటు ఎన్నికలలో నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 71.92 శాతం పోలింగ్ నమోదయ్యింది. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి 3.59 శాతం ఓటింగ్ ఎక్కువగా జరిగింది. ముఖ్యంగా ఇదివరకు తక్కువ ఓటింగ్ నమోదైన నిజామాబాద్ నగరం, ఇతర పట్టణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం పోలింగ్ శాతం పెరిగేందుకు దోహదపడింది. స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటర్లకు 5కె రన్, గ్రామీణా ప్రాంతాల్లో ఓటర్ అవగాహన సదస్సులు నిర్వహించి ఓటింగ్ శాతం పెరగడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదములు.' అని కలెక్టర్ తెలిపారు. ఈ వేడుకల్లో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, వివిధ శాఖల అధికారులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను తమ కట్టూ, బొట్టు, ప్రత్యేక వేషధారణలతో ఆవిష్కరింపజేశారు. చూడచక్కని నృత్య ప్రదర్శనలతో జానపద కళ ఔన్నత్యాన్ని చాటారు. ఎవరికివారు చిన్నారులు పోటాపోటీగా చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కలెక్టర్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రదర్శనలు ముగిసిన అనంతరం చిన్నారులను వేదికపైకి ఆహ్వానించి వారిని అభినందిస్తూ ప్రోత్సహించారు.

తెలంగాణ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు..

జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల అమరవీరుల స్మారక స్థూపం వద్ద అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, నగర మేయర్ నీతూకిరణ్, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్ తదితరులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

పుట్టగొడుగుల్లా ప్రయివేట్ పాఠశాలలు

- అందినకాడికి దండుకుంటున్న యాజమాన్యాలు
- యూనిఫామ్, పుస్తకాల పేరుతో ముక్కుపిండి వసూళ్లు
- విద్యా వ్యాపారాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు..?



నవతెలంగాణ-బిచ్కుంద

తల్లిదండ్రులు పిల్లలకు చక్కటి భవిష్యత్తు ఇవ్వాలనుకునే ఉన్నత చదువులు చదివించాలని పేద మధ్యతరగతికి చెందిన పేద విద్యార్థుల కలలు కలలుగానే మిగిలిపోతున్నాయి. ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీల అనుమతికి సంబంధించిన విద్యాశాఖ అధికారులు నిబంధనలను సైతం తుంగలో తొక్కి అందినంత దండుకొని విచ్చలవిడిగా అనుమతులు జారీ చేస్తున్నారు. ఆ తర్వాత ప్రైవేట్ పాఠశాలల యజమానులు పిల్లల తల్లిదండ్రుల వద్ద నుంచి డొనేషన్లు, డ్రెస్సులు పేరుతో అలాగే పుస్తకాల విక్రయిస్తూ ముక్కు పిండి ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారు.

బిచ్కుంద మండలంలో ప్రయివేట్ పాఠశాలలు ప్రతి సంవత్సరం పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదంటూ విమర్శలు ఉన్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం వారిని మంచి పాఠశాలలో చేర్పించాలని ఆశలు గల్లంతవుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలలో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తుండడం విద్యాశాఖ అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు పెద్ద ఎత్తున వెలుస్తున్నా.. విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలలు నెలకొల్పి విద్యా వ్యాపారం కొనసాగిస్తున్నారు. మండల విద్యాధికారులకు మామూలు ముట్టజెప్పి మచ్చిక చేసుకొని ప్రభుత్వ పాఠశాలలకు ఎగనామం పెట్టి ఎక్కువ సమయం తాము భాగస్వామి ఉన్న ప్రైవేట్ పాఠశాలలకు కేటాయిస్తూ యథేచ్ఛగా విద్యా వ్యాపారం కొనసాగిస్తున్నారు. దీంతో పాటు తాము నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలో సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు నవోదయ ప్రవేశపరీక్ష ప్రత్యేక కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్టు కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ మోసం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో విద్యా వ్యాపారంతో లక్షల్లో లాభాలు ఆర్జిస్తూ కొందరైతే సొంత పాఠశాల భవనాలు నిర్మాణం చేపడుతున్నారు. దీంతో ఈ ప్రాంతంలో విద్యా వ్యాపారం ఏ స్థాయిలో కొనసాగుతున్నదో ఊహించవచ్చు.

విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజులు, పుస్తకాల భారం..

ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థి తల్లిదండ్రులపై ఫీజుల భారం మోపడంతో పాటు పుస్తకాలను కూడా పాఠశాలలోనే విక్రయిస్తున్నారు. బయట కొనుగోలు చేయడానికి పాఠశాల యాజమాన్యం నిబంధనలు విధిస్తూ తమ పాఠశాలలోనే పుస్తకాలు కొనుక్కోవాలని ఒక తరగతికి రూపాయలు వెయ్యి ధర పలికే పుస్తకాలను ఐదు వేల వరకు విక్రయిస్తూ యూనిఫాంలు, టైలు, బెల్టులు, బ్యాడ్జీ తదితర వస్తువులను అధిక ధరలకు విక్రయించి సామాన్య ప్రజలకు దోచుకుంటున్నారు. సాధారణంగా పుస్తకాలు కొనుగోలుపై 30 నుంచి 50 శాతం డిస్కౌంట్ యాజమాన్యాలకు లభిస్తుంది. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం మాత్రం పైసా డిస్కౌంట్ ఇవ్వకుండా పుస్తకాలపై ఉన్న ధరలకు విక్రయించి యథేచ్ఛగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా దోపిడీని అరికట్టడానికి ప్రభుత్వం ఎన్ని జీవోలు తీసుకు వచ్చినా విద్యాశాఖ అధికారుల కుమ్మక్కుతో నిబంధనలు నీరుగారి పోతున్నాయి. ఆర్థిక పరిస్థితి బాగా లేక తాము ఇతర పాఠశాలకు వెళ్తామంటే పాఠశాల యజమాన్యులు టీసీ ఇవ్వడానికి కూడా నిరాకరిస్తున్నట్లు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. అనుమతులు లేకుండా నడిపిస్తున్న ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులకు ప్రతి విద్యా సంవత్సరం ఆరంభంలో నోటీసులు అందజేసి హడావుడి చేసే విద్య శాఖ అధికారులకు ముడుపులు అందగానే ఈ విషయాన్ని పక్కన పెట్టేస్తున్నారు. ఈ ప్రాంతంలో యథేచ్ఛగా కొనసాగుతున్న విద్యా వ్యాపారాన్ని జిల్లా అధికారులు తనిఖీలు చేపట్టి ప్రైవేట్ పాఠశాలల ఆగడాలపై విద్యా వ్యాపారం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో పశుగ్రాసం కొరత

తగ్గిన పాల దిగుబడి.. వరి కోత యంత్రాలతో కోతనే కారణం



నవతెలంగాణ-నసురుల్లాబాద్

పశుగ్రాసం కొరతతో రైతులకు పశువుల పోషణ భారంగా మారుతోంది. ఆరుబయట మేత లభించక మూగ జీవాలు తల్లడిల్లిపోతున్నాయి. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల ఫలితంగా పశుగ్రాసం దొరకని దుస్థితి నెలకొంది. గడ్డి ధరలు కూడా ఆకాశన్నంటాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా గడ్డి సమస్య అన్నదాతను వెంటాడుతోంది. పశువులకు వేసే పచ్చిగడ్డి, తిండి గింజలు, పశుగ్రాసం కొరతతోపాటు నీటి సమస్య ఎదురవుతోంది.

పాడి పరిశ్రమకు, పశుసంపదకు ఎంతో పేరు గాంచిన బాన్సువాడ డివిజన్‌లో నేడు పశుగ్రాసం కొరత ఏర్పడడంతో రైతులు పశువుల కోసం ఇతర ప్రాంతాల నుంచి పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నారు. మరికొంత రైతులు పశుగ్రాసం లేకపోవడంతో పశువులను అతి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. 2019లో ఉమ్మడి బీర్కూర్ మండలంలో ఏడువేలపైగా పశువులు ఉండగా నేడు వెయ్యి నుంచి రెండు వేల సంఖ్యకు పడిపోయింది. దీనితో పాల ఉత్పత్తి తగ్గిపోవడంతో నకిలీ పాల ఉత్పత్తి పెరిగిపోయింది. నకిలీ పాలను అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

తగ్గిన గ్రాసం ఉత్పత్తి..

బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో ఉన్న వ్యవసాయ భూములన్నీ నిజాంసాగర్ ప్రధాన కాలువ ఆయకట్టు కిందనే ఉన్నాయి. ఇక్కడ అంతా వరి పంటనే అధికంగా సాగు చేస్తారు. వ్యవసాయ కూలీల కొరత ఉండడంతో నాట్లు వేసేందుకు బీహార్, యూపీ మధ్యప్రదేశ్ ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడి ప్రాంతంలో వరి నాట్లు వేసి వెళ్ళిపోతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా కోతల సమయంలో రైతు కూలీలు లేకపోవడంతో ఇక్కడున్న రైతులందరూ వ్యవసాయ యంత్రాలపై ఆధారపడి వరి కోతలను కోస్తున్నారు. వరి కోతలు యంత్రాలతో కోయడంతో పశుగ్రాసం నెలపాలవుతుంది. కొందరు రైతులు యంత్రాల సహాయంతో నేలపై పడిపోయిన గడ్డిని కట్టాలు గట్టి నిలువ ఉంచినా.. అది మూడు నాలుగు మాసాలకే సరిపోతోంది. పశుగ్రాసం కొరత ఉండడంతో చేసేదేమీ లేక కొందరు రైతులు ఉన్న పశువులను మార్కెట్లో విక్రయిస్తున్నారు. దీంతో బాన్సువాడ నియోజకవర్గంలో పాలకొరత తీవ్రంగా ఏర్పడుతుంది. పశుగ్రాసం కొరత కారణంగా పశుపోషణ భారంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సీజన్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దాదాపు 200 మెట్రిక్ టన్నుల పచ్చి గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఎకరానికి 20 కిలోల గడ్డి విత్తనాలను సాగు చేయవచ్చని, ఫలితంగా రైతుకు పశుగ్రాసం కొరత తీరుతుందని పేర్కొంటున్నారు.

గ్రాసం కోసం తిప్పలు..

పాడి పశువులను కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుకు కొంత ఆదాయాన్ని ఇచ్చే పాడి పరిశ్రమ తగ్గిపోతోంది. ఇప్పటికే పశువుల సంఖ్య తగ్గుముఖం పట్టగా మిగిలిన కొద్ది పాటి పశువులకు గ్రాసం కొరత పట్టిపీడిస్తోంది. మూగజీవాలను సాకడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఎండలతో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. పశువులు దాహార్తి తీర్చలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

భగ్గుమంటున్న ధరలు..

రైతులు పశుగ్రాసం కొనుగోలు చేద్దామంటే ధరలు భగ్గుమంటున్నాయి. చేనుచేలక నుంచి అటుఇటు తిరిగొచ్చిన పశువులకు కనీసం నీటి వస తిని అందించలేని పరిస్థితి నెలకొంది. వరి గడ్డి ట్రాక్టర్ లోడు రూ.4000 నుంచి 4500 వరకు, ఎడ్లబండి గడ్డి రూ.2500 నుంచి 3000 వరకు ధర పలుకుతోంది. పచ్చి గడ్డి గుంట విస్తీర్ణంకు నెలకు రూ.1200 రూపాయలవరకు ఖర్చవుతోంది. పాలు ఇచ్చే గేదెలకు, ఆవులకు పచ్చి గడ్డి వేస్తారు. సరైనా తిండి లభించకపోతే పాల దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పాడి పరిశ్రమపై ఇప్పటికైనా శ్రద్ధ చూపి పశు సంపదన పెరిగేందుకు కృషి చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

తప్పిదాలకు అవకాశం ఇవ్వొద్దు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- అబ్జర్వర్‌తో కలిసి కౌంటింగ్ సెంటర్ పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఓట్ల లెక్కింపులో నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కేంద్రమైన డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి సీఎంసీ కేంద్రాన్ని జనరల్ అబ్జర్వర్ ఎలిస్ వజ్ ఆర్‌తో కలిసి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, ఇతర అధికారులు ఆదివారం సందర్శించారు. పార్లమెంటు నియోజకవర్గంలోని బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను నిశితంగా పరిశీలన జరిపారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌ను సందర్శించారు. ఆయా కౌంటింగ్ హాళ్లలో టేబుళ్లు, బారికేడ్లు, సిసి కెమెరాలు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా అన్నివిధాలుగా సన్నద్ధమై ఉండాలన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నియోజకవర్గ వివరాలను తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని, ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును చేపట్టి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని, పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్‌వారీగా జాగ్రత్తగా లెక్కిస్తూ, ప్రతి రౌండ్‌కు ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని అన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వచ్చి సరిచేస్తారని, కౌంటింగ్ ప్రక్రియను యథాతథంగా కొనసాగించాలని తెలిపారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందితో పాటు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వివిధ కార్యకలాపాల నిర్వహణ కోసం నియమించబడిన వారికి పాసులు అందించాలని, పాసు కలిగి ఉన్న వారినే కౌంటింగ్ సెంటర్‌లోనికి అనుమతించాలని సూచించారు. అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా తుది ఏర్పాట్లను సరిచేసుకోవాలని, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా పక్కాగా నిబంధనలను పాటిస్తూ, పారదర్శకంగా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని హితవు పలికారు. ఎలాంటి అప్రశుతులకు తావులేకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని సీ.పీ కల్మేశ్వర్ అన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.



నవతెలంగాణ
నిజామాబాద్
సోమవారం | జూన్ 03, 2024 | www.navatelangana.com

నేడు నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నేడు నగరం లో త్రాగు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆదివారం నీటి సరపరా పైపు లైన్ వాల్స్ మార్చబడిన కారణంగా గౌతంనగర్, నాందేవ్ వాడ(పాత), నాందేవ్ వాడ (అర్చన హాస్పిటల్), గోల్ హనుమాన్, వినాయక్ నగర్, తిలక్ గార్డెన్ ఏరియా, ఎల్లమ్మ గుట్ట, మహలక్ష్మి నగర్, మిర్చి కాంపౌండ్, సుభాష్ నగర్, కంఠేశ్వర్ (కొత్త), కంఠేశ్వర్ (పాత), పంచాయత్ రాజ్ కాలని, కంఠేశ్వర్ (గడ్డ), గంగస్తాన్ (ఫేస్ -1) ప్రాంతాల్లో సోమవారం తాగు నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. నగర ప్రజలు గమనించి, సహకరిస్తూ ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా ఉంటుందని తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారునికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్



జెస్సు అనిల్‌ను సన్మానిస్తున్న నాయకులు

2009లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న బీజేపి నాయకులు జెస్సు అనిల్ కుమార్‌ను అప్పటి ప్రభుత్వం జైలుకు పంపగా ఆయన అక్కడే నిరాహార దీక్ష చేశారని బీజేపీ నాయకులు అన్నారు. దాదాపు మూడున్నర రోజులపాటు ఆహారం లేకుండా నిరాహారదీక్ష చేశారని తెలిపారు. పది సంవత్సరాల తెలంగాణ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బిజెపి జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు పోల్కం వేణు, పులి యుగంధర్, పట్టణ ఉపాధ్యక్షులు దోండి ప్రకాష్, ఓబీసీ మోర్చ, పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్, బీజేవైఎం పట్టణ కార్యదర్శి రెడ్డబోయిన దక్షిణామూర్తి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్: ఆలూర్ సొసైటీలో



ఆర్మూర్: కోర్టు వద్ద



ఆర్మూర్: నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో..



బాల్కొండలో..

అమరుల యాదిలో అవతరణ దినోత్సవం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను నిజామాబాద్ జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, పార్టీ ఆఫీసులవద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేశారు. తెలంగాణ అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి అమరులను స్మరించుకున్నారు. అందరం కలిసికట్టుగా ఉత్సవాలను జరుపుకుంటూ అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని పలువురు పేర్కొన్నారు.

నవతెలంగాణ-విలేకరుల బృందం



బాల్కొండ: యంపిడివో కార్యాలయం వద్ద



భీంగల్ రూరల్: పల్లికొండ గ్రామ పంచాయతీలో..



డిచ్‌పల్లి: రాంపూర్‌లో..



కమ్మర్‌పల్లిలో..



డిచ్‌పల్లి: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..



నిజామాబాద్ రూరల్: బీఈడీ కాలేజ్‌లో..



నిజామాబాద్‌సిటీ: అమరులకు నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్



జక్రాన్‌పల్లి : తహసిల్దార్ కార్యాలయంలో..



మాక్లూర్‌లో..



మెండోరా: ఎంపీడీవో కార్యాలయం వద్ద జెండావిష్కరణ



నిజామాబాద్‌సిటీ : ఎన్‌డిసిసిబి కార్యాలయంలో..



మోపాల్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో..



ముప్కాల్‌లో..



నిజామాబాద్‌సిటీ : టిడిపి కార్యాలయం వద్ద జెండావందనం చేస్తున్న నాయకులు



నిజామాబాద్‌సిటీ : జెండాకు వందనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నిజామాబాద్: సిపి కార్యాలయంలో జెండావందనం

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
సోమవారం | జూన్ 03, 2024 | www.navatelangana.com

ఇసుక టిప్పర్ పట్టివేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని పేపర్‌మిల్లు గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని తహసీల్దార్‌కు అప్పగించనున్నట్లు రెంజల్ ఎస్ఐ ఈ.సాయన్న తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.


పట్టుకున్న ఇసుక టిప్పర్

వివాహానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని జల్లాపల్లి గ్రామంలో ఎం.పి.టి.సి ఫోరమ్ మాజీ అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాసరావు నిరుపేద కుటుంబానికి చెందిన షేక్ మహబూబ్ కుమార్తె అస్మా బేగం వివాహానికి హాజరై వారికి రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. తాము ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని, తగిన సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటామని తెలిపారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం


బోధన్ : సహకార సంఘం కార్యాలయం వద్ద జెండావిష్కరణ


బోధన్: మున్సిపల్ కార్యాలయం వద్ద జెండావిష్కరణ


నాగిరెడ్డిపేట్: మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండావిష్కరణ


గాంధారి మండల కేంద్రంలో..

ఘనంగా ఆవిర్భావ వేడుకలు

జాతీయ జెండాను ఆవిష్కరించిన పలువురు

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఆయా కార్యాలయాల వద్ద జెండాను ఆవిష్కరించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో అమరులైన వారికి నివాళులర్పించారు.


కామారెడ్డి: మున్సిపల్ కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ


లింగంపేట్: తహసీల్దార్ కార్యాలయం వద్ద..


మద్నూర్: తహసీల్దార్ కార్యాలయం వద్ద..


నిజాంసాగర్: మండల పరిషత్ కార్యాలయం ఎదుట జెండావిష్కరణ


పోతంగల్ : బీఆర్ఎస్ కార్యాలయం వద్ద జెండావిష్కరణ


మద్నూర్ : మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో జెండావిష్కరణ


దోమకొండ : మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండావిష్కరణ


రెంజల్ : తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జెండావిష్కరణ


ఎడపల్లి : మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండావిష్కరిస్తున్న ఎంపీపీ


కామారెడ్డి: ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో జెండావందనం చేస్తున్న ఎమ్మెల్యే


కోటగిరి: మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండావందనం చేస్తున్న పలువురు


పెద్దకొడప్‌గల్ : మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండావిష్కరణ


పిట్లం : వివేకానంద పాఠశాలలో జెండావిష్కరణ


రామారెడ్డి : అమరుడు రమేష్‌కు నివాళులర్పిస్తున్న పలువురు


ఎడపల్లి : మంగల్‌పాడ్ గ్రామంలో..


పిట్లం: తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండావిష్కరణ


కామారెడ్డి : జెండావందనం చేస్తున్న ఎస్పీ


బోధన్ : సాలుర లైబ్రరీ వద్ద


సదాశివనగర్: తహసీల్దార్ కార్యాలయంలో


ఎల్లారెడ్డి : పట్టణంలో..


మద్నూర్ : సింగిల్‌విండో కార్యాలయంలో జెండావిష్కరణ

చింతలూరులో గ్రామదేవతలకు జలాభిషేకం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

చింతలూరులో గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించినట్లు కొలిప్యాక్ సింగిల్ విండోచైర్మన్ నాగుల శ్రీనివాస్ తెలిపారు. ప్రతి సంవత్సరం మృగశిర కార్తెను పురస్కరించుకొని గ్రామంలోని అన్ని దేవతలకు జలాభిషేకం నిర్వహించి నైవేద్యాలు సమర్పిస్తామని చెప్పారు. గ్రామంలోని పాడి పంట అంతా బాగుండాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామ ప్రజలు సంతోషంగా ఉత్సవాలను నిర్వహించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల పండుగ సంబరాలకు తరలిన ఉద్యమకారులు



నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ రాష్ట్ర అవతరణ పదేళ్ల పండుగ సంబరాలు పరేడ్ గ్రౌండ్ సికింద్రాబాద్ లో ఆదివారం జరిగిన బహిరంగ సభకు టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు గైని గంగారం ఆధ్వర్యంలో జిల్లా నుండి ప్రత్యేక బస్సులో పలువురు బయలుదేరారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా మలి దశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు బాల్కొండ జేఏసీ కన్వీనర్ షేక్ రహీమొద్దీన్ , తదితరులు ఉన్నారు.

పిల్లలపై ఒత్తిడి తీసుకురావద్దు



మాట్లాడుతున్న మానసిక వైద్యులు ఏవీఎస్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తీసుకురావద్దని డాక్టర్ ఏవీఎస్ అన్నారు. తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ నిజామాబాద్ జిల్లా శాఖ అధ్వర్యంలో నామ్‌దేవ్ వాడలోని టిఎంఎస్ఆర్‌యు కార్యాలయంలో అవగాహన సదస్సు మెడికల్ రిప్స్ అధ్యక్షుడు శ్రీనివాస్ రాజు అధ్యక్షత ఆదివారం నిర్వహించారు. "సంతోషకరమైన, ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు" అనే అంశంపై ప్రముఖ మానసిక వైద్యుడు ఎవిఎస్ అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లితండ్రులు పిల్లలని పూర్తిగా అర్థం చేసుకొని వారి అభివృద్ధికి తోడ్పడాలని సలహాలు సూచనలు చేశారు. పిల్లలపైన ఎలాంటివొత్తిడి చేయకుడధాని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వర్ ఛాతీ వైద్యుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, నాయకులు లక్ష్మీకాంత్, ఆర్.శ్రీనివాస్, సంపత్, సాయిరాజ్, 40 మంది సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రామ్‌కిషన్‌రావు

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను రాష్ట్ర నాయకులు రామ్ కిషన్ రావు ఆదివారం పరామర్శించారు. మండల కేంద్రంలోని హరినాం సింగ్ తల్లి ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబానికి పరామర్శించి ఆర్థిక సహకారాన్ని అందించారు. రాంపూర్ సీనియర్ నాయకులు పోశెట్టి తల్లి, మంత్రి రాము తండ్రి ఇటీవల మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నర్సింగ్ రావు, జిల్లా నాయకులు తెడ్డు పోశెట్టి, నర్సింగ్ రావు, గైని సతీష్, ఈర్నాల స్వామి, పోశెట్టి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అంతా ఒకేచోట చేరిన పూర్వవిద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

1994-95 పదోతరగతి బ్యాచ్ 'ముప్కాల్ జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం 'జీఎస్ఆర్ గార్డెన్' లో నిర్వహించుకున్నారు. ఒకచోట చేరిన వారంతా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ సంతోషసాగరంలో మునిగిపోయారు. పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

తిర్మన్‌పల్లిలో ఘనంగా బోనాలు



బోనాల పండుగలో పాల్గొన్న వీడీసీ సభ్యులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ అద్వర్యంలో ఆదివారం పోచమ్మ పండుగ సందర్భంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గోపు గోవర్ధన్ మాట్లాడుతూ ప్రతి ఏటా పోచమ్మ పండుగ ను అన్ని కులాల వారితో కలిసి నిర్వహిస్తామని తెలిపారు. మంచి వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశామని అన్నారు. కార్యక్రమంలో విడిసి సభ్యులు మెకాల వెంకటి, కిషన్, లింగన్న, శ్రీనివాస్, కొమురయ్య, చెక్ పావర్ ఎర్రోళ్ల సాయన్న, మహేష్, సురేష్, గంగారం, మహేందర్, శివరాములు, శేఖర్ గౌడ్, ప్రసాద్, గ్రామస్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

కమిటీ పేరుతో కాలయాపన వద్దు

- అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌ను వెంటనే సీజ్ చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అధికారులు విచారణ కమిటీల పేర్లతో కాలయాపన చేయొద్దని, అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌ను వెంటనే సీజ్ చేయాలని, పర్మిషన్ లేని ప్రైవేట్ హాస్పిటల్, స్కానింగ్ సెంటర్లు లను సీజ్ చేయాలి. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ హెచ్చరించారు. ఆదివారం నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్ స్కానింగ్ సెంటర్లను అధికారులు తనిఖీలు చెయ్యలేదన్నారు. పర్మిషన్లు లేవు అందుకే ప్రవేట్ హాస్పిటల్ రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారిపోయి ప్రజల ప్రాణాలకు విలువ లేకుండా పోయిందన్నారు. పేద ప్రజలకు జ్వరం వచ్చి దవాఖానకు పోతే టెస్టులు, ఎక్రేలు, స్కానింగ్‌ల పేర్లతో వేల రూపాయలు దోచుకుంటున్నారని తెలిపారు. పర్మిషన్ లేని హాస్పిటల్, స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయాలని అన్నారు. మహిళలు రోగం వచ్చి స్కానింగ్ కోసం పోతే అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో ఆపరేటర్ ప్రశాంత్ రహస్యంగా కెమెరాలను బిగించి అశ్లీల దృశ్యాలను చిత్రీకరించి మహిళల్ని బ్లాక్ మెయిల్ చేసిన ఆ కీచకుడిని కఠినంగా శిక్షించాలని, స్కానింగ్ మేనేజ్మెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కమిటీల పేర్లతో కాలయాపన చేయకుండా అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌ను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, జిల్లా కోశాధికారి స్వర్ణ, జిల్లా ఉపాధ్యక్షులు జంగం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నూర్జహాన్

మహతి ఆశ్రమానికి రూ.50 వేలు అందజేత

- చెక్కును అందించిన పూర్వ విద్యార్థులు
- ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా

నవతెలంగాణ-ఏర్గట్ల



తాళ్ళ రాంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదవుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఇందులో భాగంగా తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించి, పాత జ్ఞాపకాలను గుర్తుచేసు కున్నారు. వారు ఏర్పాటు చేసుకున్న ఫ్రెండ్స్ హాప్ అనే ఫౌండేషన్ ద్వారా బాల్కొండ మండలానికి చెందిన మహతి ఆశ్రమానికి 50వేల రూపాయల చెక్కును అందజేశారు. పూర్వ విద్యార్థులతో పాటు, మహతి ఆశ్రమానికి విద్యార్థులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని గాలిబ్‌నగర్ తండాల్లో కొబ్బరి చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గంగరమంద గ్రామానికి చెందిన గంగొనే భూమయ్య అనే రైతు పొలంలో కొబ్బరి చెట్టు పై గల కొబ్బరి కాయలు కోయడానికి నందిపెట్ మండలంలోని జోజీ పెట్ గ్రామానికి చెందిన చౌటురి కమ్మయ్య(45) కూలికి వెళ్లాడు. కాయలు కోస్తున్న క్రమంలో చెట్టుపై నుంచి పడి అక్కడిక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు దాటుతుండగా

వాహనం ఢీకొని ఒకరు మృతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మండలంలోని అర్గుల్ గ్రామ శివారులో ఒక వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనగా వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం..ఆదివారం ఉదయం వేకువ జాము సమయంలో అర్గుల్ గ్రామ శివారులోని మైత్రి గార్డెన్ ముందర గుర్తు తెలియని మగ వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. ఈసమయంలో హైదరాబద్ నుండి ఆర్మూర్ వైపు వేగంగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం టక్కర్ ఇవ్వటంతో తీవ్ర గాయాలు అయి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

రాష్టస్థాయి పోటీలకు క్షత్రియ పాఠశాల విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

పట్టణంలోని క్షత్రియ పాఠశాలలలో, మండలంలోని చేపూర్ నందు తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్స్ లక్ష్మీనరసింహస్వామి, నవితా అల్జాపూర్ అక్షయ్ జ్యోతి ప్రజ్వలన గావించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి క్షత్రియ విద్యా సంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా తమ సందేశాన్ని వినిపించారు. ఎందరో అమరవీరుల త్యాగ ఫలమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అని, తెలంగాణ ప్రజల ఉద్యమ స్ఫూర్తి భారత ప్రభుత్వాన్ని ఆలోచింపజేసిందని అని అన్నారు. ఈ సందర్భంగా 1969 నాటి పోలీసుల కాల్పుల ఘటన తన మనస్సును ఎంతో చలింపజేసిందని తెలిపారు. నాగారంలోని రాజారాం స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో క్షత్రియ విద్యార్థులు కె. ప్రణతి స్టాండింగ్ జంప్‌లో, కొప్పుల రాంచరణ్, మార్వాడి విఘ్నేష్, కొప్పుల వర్షిణి వ్యక్తిగత పరుగు పందెం పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానాన్ని పొంది విజేతలుగా నిలిచారు. ఈ నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ప్రిన్సిపల్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అల్జాపూర్ అక్షయ్, టీచర్స్ కాలనీ పాఠశాల ప్రిన్సిపాల్ నవిత, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి కోసం గాలింపు

డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరా ద్వారా



డాగ్ స్క్వాడ్‌తో గాలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కేశ్‌పల్లి గ్రామానికి చెందిన మున్నూరు జగదీష్ ఆచూకీకోసం డాగ్ స్క్వాడ్ ద్వారా డ్రోన్ కెమెరా ద్వారా గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్ఐ తిరుపతి ఆదివారం తెలిపారు. గతనెల 31న ఇంటి నుండి బయటకి వెళ్లి తిరిగిరాలేదన్నారు. కేశ్ పల్లి గ్రామా పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

ఉత్తమ విద్యుత్ ఉద్యోగులకు అవార్డులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా టీజీఎన్పీడీసీఎల్ సిఎండి ఐఏఎస్ కర్నాటి వరుణ్ రెడ్డి 2023- 2024 వార్షిక సంవత్సరానికి గాను నిజామాబాదు జిల్లాకు చెందిన 9 మంది ఉద్యోగులకు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డ్స్ హనంకొండలో ప్రధాన కార్యాలయం నందు ఆదివారం ప్రదానం చేశారు. నిజామాబాద్ ఆపరేషన్ ఎస్ఈ ఆర్.రవీందర్, నవీపేట్ ఆపరేషన్ ఏడిఈ జి.సుహాసిని, నిజామాబాద్ ఆపరేషన్ ఏడిఈ టౌన్-2 తోట రాజాశేఖర్, బర్దిపూర్ ఆపరేషన్ ఏఈపి.రాజేందర్, నిజామాబాద్ ఆపరేషన్ ఏఏఈ డీ-2 ఆర్.సుమిత, కోటగిరి ఆపరేషన్ ఏఏఈ ఆర్. కృష్ణ, సుభాష్ నగర్ ఆపరేషన్ ఏఈ గంగశేఖర్, బోధన్ టౌన్ -1 ఎల్ఎం పి.చంద్రకాంత్, దేగాం ఆపరేషన్ ఎల్ ఏం షీలా శివ కుమార్‌లకు ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి అవార్డులను అందజేశారు.



అవార్డులు అందుకుంటున్న విద్యుత్ ఉద్యోగలు

ప్రగతిశీల మహిళా పోరాటాలు నిర్మిద్దాం : పీఓడబ్ల్యూ

నవతెలంగాణ-సిరికొండ

ప్రగతిశీల మహిళా పోరాటాలు నిర్మిద్దామని, మహిళలు ఎదురకొంటున్న అన్నీ వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడదాం అని పీఓడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోదావరి పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోఈనెల 2,3 తేదీల్లో జరగనున్న పీఓడబ్ల్యు రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులకు సిరికొండ, నిజామాబాద్ నుండి మహిళలు ఆదివారం తరలివెళ్లారు. వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకి వచ్చాక మహిళపై మరిన్ని దాడులు పెరిగాయాని అన్నారు. దేశంలో మనువాదంను అమలు చేయాలని, కుట్రలు పన్నుతున్నారన్నారు. భేటీ బచావో అంటు మణిపూర్ లోఅర్థనగ్నంగా చిత్రహింసలు పెడుతూ ఊరేగించడం బీజేపీ ఆటవీక సంస్కృతికి నిదర్శనం అన్నారు. బీజేపీ మత ఉన్మాదరాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలి అన్నారు. మహిళలు రాజకీయ చైతన్యం పెంచుకొని పోరాడాలని ఆమె కోరారు. వెళ్లినవ ఆరిలో జిల్లా ఉపధ్యక్షురాలు జి.సత్తేమ్మ డివిజన్ అధ్యక్షురాలు రమ, మండల నాయకురాలు ఆర్. పుష్పలత, జిల్లా నాయకురాలు నాగమణి, నర్సక్క తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి బాలిక మృతి

నవతెలంగాణ-భీంగల్ రూరల్



కల్పిత (ఫైల్)

భీంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పురాణిపేట్ గ్రామంలో విషాదం నెలకొంది. నిలిపి ఉన్న ట్రాక్టర్ కింద పడి బాలిక మృతి చెందిన సంఘటన జరిగింది. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బ్రహ్మ రౌతు సంతోష్ పెద్ద కుమార్తె కల్పిత (9) ఇంటి సమీపంలో ఎరువు నింపేందుకు నిలిపి ఉంచిన ట్రాక్టర్‌పై ఎక్కి ఆడుకుంటుంది. ఈ క్రమంలో ఒక్కసారి ట్రాక్టర్ ముందుకు కదలడంతో భయపడి పోయిన బాలిక ట్రాక్టర్‌పై నుండి కిందికి దూకింది. దుకే క్రమంలో కింద పడిన బాలిక పైనుండి ట్రాక్టర్ టైర్ వెళ్లడంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహన్ని పోస్ట్ మార్టం కొరకు ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.

అథ్లెటిక్స్‌లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వివిధ పోటీల్లో సుమారు 250 మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్నారు. ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు గత సంవత్సరం(అక్టోబర్‌లో 8 పతకాలు, ఫిబ్రవరిలో 16 పతకాలు సాధించారు) ఈసారీ మంచి ప్రతిభ కనబరిచి 4 బంగారు, 4 వెండి, 3 తామ్ర పతకాలు మొత్తం 11 పతకాలు సాధించడం ఆనందంగా ఉందని అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిజామాబాద్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య చేతుల మీదుగా పతకాలను అందజేసినట్టు తెలిపారు. పథకాలు సాధించిన విద్యార్థుల సబ్ జూనియర్ ఈనెల 31 న రాజరాం స్టేడియంలో 300 మీటర్ రన్నింగ్ రేస్‌లో 3 వ తరగతి విద్యార్థి అన్విత కు బ్రాంజ్ మెడల్, 6 వ తరగతి విద్యార్థి లాంగ్ జంప్‌లో జశ్వంత్ గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సుశాంత్, 5 వ తరగతి అసిదా, 400 మీటర్స్ రన్నింగ్ రేస్‌లో 6 వ తరగతి విద్యార్థులు జస్వంత్ గోల్డ్ మెడల్, సుశాంత్ బ్రౌంజ్ మెడల్, 100 మీటర్ల రన్నింగ్ రేస్‌లో 6 వ తరగతి విద్యార్థులు సుశాంత్ గోల్డ్ మెడల్, అజయ్ కుమార్ సిల్వర్ మెడల్, జస్వంత్ బ్రౌంజ్ మోడల్, జావిలిన్‌త్రోలో ఆరవ తరగతి విద్యార్థులు అజయ్ కుమార్ సిల్వర్ మెడల్ సుశాంత్ బ్రాంజ్ మెడల్ సాధించారు. విద్యార్థులను పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ ప్రశంసించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-మాక్లూర్



సురేష్ మృతదేహం

మండలంలోని మానిక్ బండారు గ్రామానికి చెందిన గుండారం సురేష్(43) చికిత్స పొందుతూ ఆది వారం మృతి చెంది నట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు. గుం డారం సురేష్ నిజామా బాద్‌లో అపార్ట్ మెంట్ వాచ్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆర్థిక సమస్యల వలన జీవితంపై విరక్తి చెంది గత నెల 27న మానిక్ బండారు కళ్ళు బట్టి వద్ద పురుగుల మందు తాగడంతో స్థానికులు గమనించి కుటుంబీకులకు తెలిపారు. కుటుంబీకుల ఆయన్ను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకు వెళ్ళారు. అక్కడ ఖర్చులు ఎక్కువ అవుతున్నాయని ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని బార్య గుండారం మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని కోర్పోల్ గ్రామానికి చెందిన 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులకు ఆదివారం ప్రేరణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కోర్పోల్ గ్రామానికి చెందిన విద్యార్థులు కర్రోళ్ల చిత్రలేఖ 9.2, పర్శం రాకేశ్ 9.2 సాధించి పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో సన్మానించారు. కార్యక్రమంలో మండల సమైక్య మాజీ అధ్యక్షురాలు బాగవ్వ, సొసైటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


విద్యార్థులను సన్మానించిన ఎడ్యుకేషన్ సొసైటీ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-భిక్కనూర్

రాజంపేట్ మండలంలోని తలమడ్ల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చాలా రోజుల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ విద్యాభ్యాసంలోని పూర్వ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందించారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, వెంకటరాములు, నరసింహచారి, కాళిదాసు, భూమయ్య, వెంకట్, రాజలింగం, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

ముగిసిన యాసంగి ధాన్యం కొనుగోలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలో యాసంగిలో పండించిన వరి ధాన్యం కొనుగోలు పూర్తయింది. తాండూర్, మాల్‌తుమ్మెద రెండు సొసైటీల ద్వారా భారీగా కొనుగోలు చేశారు. మాల్‌తుమ్మెద సొసైటీ పరిధిలో 12 కేంద్రాల ద్వారా తాండూర్ సొసైటీ పరిధిలో 11 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశారు. మాల్‌తుమ్మెద సొసైటీ పరిధిలో గల మాల్‌తుమ్మెద, వదలపర్తి, గోపాల్పేట్, గోలిలింగాల్, నాగిరెడ్డిపేట్, చినూర్, వాడి, బంజర, లింగంపల్లి, ఆబెదనగర్, పోచారం, వెంకంపల్లి, తాండూర్ సొసైటీ పరిధిలో గల తాండూర్, కిచెన్నపేట్, బొల్లారం, జానకంపల్లి, ధర్మారెడ్డి, రాఘవపల్లి, అచ్చాయిపల్లి, జలాల్పూర్, మెల్లకుంట తండా, ఆత్మకూర్, మాటూర్, మాసంపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. మండల వ్యాప్తంగా 3,51,130 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేశారు. రైతుల ఖాతాలో సంబంధిత డబ్బును జమ చేసినట్టు సొసైటీ సీఈవోలు తెలిపారు.

హమాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో కొంత ఆలస్యం..

నాగిరెడ్డిపేట మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఆయా గ్రామాల రైతులు ధాన్యం కొనుగోలు సమయంలో కొందరు రైతులు, హమాలీలు ధాన్యం తూకం వేసేవారు. ప్రస్తుతం గత రెండు సంవత్సరాలుగా వరి ధాన్యం తూకం వేయడానికి ఆయా గ్రామాల రైతులు హమాలీలు ఇష్టపడడం లేదు. తద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆలస్యమవుతోంది. నాట్లు వేసే దగ్గరనుంచి ధాన్యం తూకం వేసే వరకు ప్రతీది బీహార్ కూలీలపై ఆధారపడాల్సి వస్తుంది. వరి నాట్ల సమయంలో భారీగా బిహారీలు తెలంగాణ రాష్ట్రానికి వచ్చి పంట పొలాల్లో నాట్లు వేస్తున్నారు. ఆ తర్వాత పంట కోసిన అనంతరం ధాన్యం తూకం వేయడానికి బిహారి కూలీలను సొసైటీలు ముందుగా అడ్వాన్స్ డబ్బులు చెల్లించి వారికి తూకం వేయడానికి తీసుకువస్తున్నారు.


ధాన్యం లోడింగ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ (ఫైల్)

రైతుల సహకారంతోనే..



సొసైటీ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగానే ఆయా గ్రామాల రైతులు ధాన్యాన్ని శుభ్రపరచి కొనుగోలు కేంద్రానికి తీసుకురావడం వల్ల అటు రైతులకు, ఇటు సొసైటీ సిబ్బందికి ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు పూర్తయ్యాయి. అందరి సహకారంతోనే ధాన్యం కొనుగోలు త్వరితగతిన పూర్తి చేశాం.

తాండూర్ సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి

చిన్ననాటి మిత్రుల ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రానికి చెందిన గొండ సురేందర్ అనే వ్యక్తి మార్చి 18 వ తేదీన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆ కుటుంబం పేద పరిస్థితిలో ఉన్నందున తన తోటి స్నేహితుడి కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో తన చిన్ననాటి పాఠశాల స్నేహితులు అందరూ కలిసి కుటుంబ సభ్యులకు రూ.25,000 ఆర్థిక సహాయం అందజేశారు. వారి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునే వరకు అండగా ఉంటామని వారు తెలిపారు. ఇంకా ఎవరైనా ఆర్థిక సహాయం కోసం ముందుకు రావాలని కుటుంబ సభ్యులు దాతలను కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, గోవింద్ చారి, రంజిత్, పండరి, అంజయ్య, జమీర్, రాములు, హనుమాన్లు తోటి మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

దారికోసం ఆందోళన


దారి విషయమై మాట్లాడుతున్న గ్రామపెద్దలు

నవతెలంగాణ-మద్నూర్

దారి కోసం మద్నూర్ మండల కేంద్రంలో గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి.. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీ రామారావు హయంలో మద్నూర్ మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. ఆ బస్టాండు ప్రస్తుతం ప్రయాణికులకు ఎలాంటి సౌకర్యంగా లేనప్పటికీ ఆ బస్టాండు స్థలాన్ని పూర్తిగా స్వాధీనంలోకి తీసుకునేందుకు చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం పనులు ప్రారంభించారు. అయితే కొత్త బస్టాండ్‌కు అతి సమీపంలో గల శ్మశాన వాటికకు ఈ కాంపౌండ్ వాల్ నిర్మాణంతో దారి లేకుండా పోతుంది. దీంతో గ్రామపెద్దలు ఆదివారం ఆందోళనకు దిగారు. వెంటనే గ్రామ కార్యదర్శిని పిలిపించి బస్టాండ్‌కు కాంపౌండ్‌వాల్ నిర్మిస్తే శ్మశాన వాటికకు వెళ్లడానికి దారి మూసి వేస్తున్నారని చూపించారు. దీంతో ఆయన వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిపించి కాంపౌండ్ వాల్ నిర్మిస్తే దారి ఎలా అని ప్రశ్నించారు. బస్టాండ్‌కు కాంపౌండ్ వాల్ నిర్మించి, దానికి బస్టాండ్‌లో నుంచి శ్మశాన వాటిక వైపు పెద్ద గేటు నిర్మించనున్నట్టు తెలపడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం


చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగుర వేసి తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి మాట్లాడుతూ.. తెలంగాణ స్వరాష్ట్రం కోసం జరిగిన దశాబ్దాల పోరాటాన్ని గౌరవించి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకే సోనియాగాంధీ తెలంగాణను ఇచ్చారన్నారు. తెలంగాణ సమాజమంతా కాంగ్రెస్ పార్టీకి, అధినేత్రి సోనియా గాంధీకి ఎప్పటికీ రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నూకల బుచ్చి మల్లయ్య, వేముల గంగారెడ్డి, ఊట్నూరి ప్రదీప్, సుంకరి రాజేశ్వర్, సింగిరెడ్డి శేఖర్, సల్లూరి గణేష్ గౌడ్, రాములు నాయక్, వేములవాడ జగదీష్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కేసు తొలగించాలని బెదిరింపు

- జర్నలిస్టును బెదరించినట్లు ఒప్పుకున్న సీనియర్ అసిస్టెంట్ సుజాత భర్త శంకర్
- అటవీశాఖలో అవినీతిపై ప్రశ్నించినందుకు జర్నలిస్టుపై కేసు పెట్టిన వైనం
- ఆలస్యంగా వెలుగులోకి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో అటవీశాఖలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సుజాతను అటవీశాఖలో జరిగిన అనధికార లావాదేవీలపై ప్రశ్నించిన జర్నలిస్టు యల్.భాస్కర్‌పై కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో అక్రమ కేసు పెట్టింది. దీంతో జర్నలిస్టు యాల్.భాస్కర్ సీనియర్ అసిస్టెంట్ సుజాతపై కేసు పెట్టాడు. ఇద్దరిపై పరస్పర కేసులు కామారెడ్డి పోలీసులు నమోదు చేశారు. సిసిఎ రూల్స్ ప్రకారం క్రిమినల్ కేసులో నిందితురాలిగా ఉన్న సుజాతను డీమ్డ్ సస్పెన్స్ చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సీనియర్ అసిస్టెంట్ సుజాత భర్త శంకర్ జర్నలిస్టు భాస్కర్‌ని సిఎస్ఐ చర్చి వద్ద ఉన్న మార్కెట్‌లో అడ్డగించి కేసు కాంప్రమైజ్ కాకపోతే చంపేస్తానని బెదిరించాడు. వెంటనే కామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కామారెడ్డి పోలీసులు విచారణ చేసి శంకర్‌పై ఐపిసి 341, 290, 506, 504 సెక్షన్స్ కింద కేసు నమోదు చేశారు. కోర్టులో శంకర్ నిజంగానే జర్నలిస్టును కేసు కాంప్రమైజ్ కావాలని బెదిరించానని ధర్మాసనం ముందు ఒప్పుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై స్పందించిన జర్నలిస్టు భాస్కర్ న్యాయం గెలిచినందుకు సంతోషంగా ఉందని అన్నారు. దీనిపై కోర్టు శంకర్‌కు రూ.2700 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. ఇలాంటి చర్యలు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిందన్నారు

జర్నలిస్టులకు భద్రత లేదు



ఈ రోజుల్లో జర్నలిస్టులను బెదిరించడం ఫ్యాషన్ అయిపోయింది. జర్నలిస్టుల భద్రత దృష్ట్యా ప్రత్యేక చట్టం తీసుకు రావాలి.

- టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు సిద్దగౌడ్

జర్నలిస్టులకు భద్రత కల్పించాలి

ప్రభుత్వం జర్నలిస్టులకు భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. జర్నలిస్టుల భద్రత దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలి. నిత్యం ఏదో ఒక మూలన జర్నలిస్టులపై దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ.

- సిఐటీయు చంద్రశేఖర్

ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు



జర్నలిస్టులపై బెదిరింపులు, దాడులు అప్రజాస్వామికం. జర్నలిస్టులను బెదిరించడం కొందరికి రోజువారీ దినచర్యగా మారింది. ప్రభుత్వాలు జర్నలిస్టుల కోసం ప్రత్యేక చట్టాలు తేవాలి. న్యాయ పోరాటం చేసిన జర్నలిస్టు భాస్కర్‌కు అభినందనలు.

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

తెలంగాణ ఉద్యమకారుడికి సన్మానం

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

మండలంలోని హాస కొత్తూర్ గ్రామంలో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు సత్యనారాయణ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయితీ కార్యదర్శి నల్లగంటి నర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, మండల విద్యాధికారి ఆంధ్రయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మలి దశ తెలంగాణ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించిన గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ గౌడ్‌ను ఘనంగా సన్మానించి మెమెంటోను అందజేశారు. అనంతరం ఆంధ్రయ్య మాట్లాడుతూ తెలంగాణ సాధనకోసం తొలిమలి దశ ఉద్యమాల్లో అనేక మంది పోరాడి నిర్బంధాన్ని సైతం ఎదుర్కొని ప్రాణ త్యాగాలు చేయడం ఫలితంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. సత్యనారాయణ గౌడ్ మలిదశ తెలంగాణ సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొనడమే కాకుండా అనేక సందర్భాల్లో జైల్లోకి వెళ్లడం, నిర్బంధాన్ని ప్రతిఘటించి నిరాహారదీక్షను కొనసాగించారన్నారు. రాస్తారోకో, వంట వార్పు హైదరాబాదులో జరిగిన మిలియన్ మార్చ్, సాగర హారం, సకల జనుల సమ్మె, సడక్ బంద్ కార్యక్రమాలకు సత్యనారాయణ గౌడ్ నాయకత్వం వహిం చాడని కొని యాడారు. ఈ సంద ర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సాధించుకున్న 10 సంవత్సరాల కాలంలో కూడా ప్రజల కోరికలు సాధించబడలేదన్నారు. ఇంటికొక ఉద్యోగం, మూడు ఎకరాల భూమి సాధించు కోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు సాధించడానికి మరో పోరాటం అవసరమని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిటికేసి గంగాధర్, కాంగ్రెస్ నాయకులు రేవతి గంగాధర్, పడిగేల ప్రవీణ్, గోపిడి లింగారెడ్డి, మోహన్ నాయక్, గ్రామ కమిటీ సెక్రెటరీ శ్రావణ్, ఉపాధ్యక్షులు రాజుల బాబయ్య, సభ్యులు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు


ఉద్యమకారుడికి సన్మానిస్తున్న గ్రామస్తులు

కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

- జుక్కల్ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి

నవతెలంగాణ-మద్నూర్

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జుక్కల్ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా కంది గ్రామంలో గల గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఎన్నికల ఫలితాల కోసం కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌంటింగ్ ఏర్పాట్లనులాయన పరిశీలించారు. ఏర్పాట్లు పరిశీలించిన వారిలో మద్నూర్ తహసిల్దార్ ఎం.డి ముజీబ్, డిప్యూటీ తహసీల్దార్ భరత్, జూనియర్ అసిస్టెంట్ రవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాల పంపిణీ


జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్‌లో సంఘ అధ్యక్షులు పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా రాయితీపై రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్ద కాపుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...30 కేజీల జీలుగ విత్తనాల ధర 2790 ఉండగా దీనిని 60 శాతం రాయితీపై ప్రభుత్వం 1116 రూపాయలకు అందించడం జరుగుతుందని అన్నారు. జీలుగ విత్తనాల కొనుగోలు కోసం పీఏసీఎస్ కు వచ్చే రైతులు తమ వెంట పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డ్ జిరాక్స్‌లు తీసుకువచ్చి రాయితీ పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు జీ.కే.శ్రీనివాస్ రెడ్డి, సంఘ డైరెక్టర్లు ఆడేం గంగాప్రసాద్, సంజీవ్, ఏఈఓ సాయి సచిన్,సంఘ కార్యదర్శి గణేష్, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షులు పున్న లక్ష్మన్, సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5000 ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన బ్రాహ్మయ్య గారి సత్తయ్య అనే వ్యక్తికి గత కొన్ని రోజుల క్రితం ఈదురుగాలులు వీచిన సమయంలో ప్రమాదవశాత్తు రెండు కాళ్లు విరిగిపోవడంతో తమవంతు సహాయంగా ముదిరాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సేవా సమితి సభ్యులు అబ్రబోయిన రాజేందర్, కదారి రమేష్, పెద్ద రాజనర్స్, తిరుపతి ఉన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న పలువురు

వేసవి కాలంలో జాగ్రత్తగా ఉండాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియ


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

వేసవికాలం ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందని కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందూప్రియ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్ తాగి పడి వేయడంతో కామారెడ్డి పట్టణంలోని ఎన్జీవోఎస్ కాలనీ 14వ వార్డులో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్పందించి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం ఫైర్ సిబ్బందికి ఫోన్ చేసి మంటలు ఆర్పించారు.

గుట్కా విక్రయాలపై దాడులు

- నవతెలంగాణ కథనానికి స్పందన



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని కిరాణా షాపులు, పాన్ షాపుల్లో ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. 'మత్తులో యువత చిత్తు' అనే శీర్షికన శనివారం నవతెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎస్సై కోనారెడ్డి మండల కేంద్రంలోని పలు కిరాణా షాపులు, పాన్‌షాప్‌లలో దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి గుట్కాలు, మత్తు పదార్థాలు విక్రయిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, వారిపై నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పోల్కంపేట్‌లో ఎడ్లబండ్ల ప్రదర్శన


ఎడ్లబండ్ల ప్రదర్శనలో చేపడుతున్న దృశ్యం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో ఆదివారం గ్రామ దేవతల జాతర ఉత్సవాలలో భాగంగా ఆలయాల వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఎడ్ల ప్రదర్శన పోటాపోటీగా జరిగింది. ఈ ప్రదర్శనను చూసేందుకు చిన్నాపెద్దా పెద్దఎత్తున తరలివచ్చారు.